జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు చెక్కులు పంపిణీ

చెక్కులు పంపిణీ చేస్తున్న అధ్యక్షులు సుధాకర్ రెడ్డి

కడప అర్బన్ : గత ఏడాది జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా సింహాద్రి సినిమాను రీ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వచ్చిన డబ్బులను ఆర్థిక ఇబ్బందులు పడుతున్న 15 మంది జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు చెక్కులను అందజేశారు. ఆదివారం అప్పరాజుపేటలో కడప జిల్లా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యర్రమల సుధాకర్ రెడ్డి, కందుల నాగేశ్వర్ రెడ్డి, సూర్య రాయల్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చారిటీ అమౌంట్ డిస్ట్రిబ్యూషన్ అల్లాబకాష్, దశరథ, హరి, సాయి గౌస్, సునీల్, రామ్ కి, శివ, కాజీపేట సునీల్ పాల్గొన్నారు.

నష్టాల ఊబిలో 'ఉద్యాన' రైతులు

- ధరల పతనంతో ఆందోళన
- వేధిస్తున్న వైరస్
- బెదరగొడుతున్న బొప్పాయి
- ఛీకొడుతున్న చీనీ
- అమాంతంగా పడిపోయిన చీనీ ధరలు
- బొప్పాయి ధరలూ పతనం
- అమలు కాని ధరల స్థిరీకరణ
- ఆదుకోని ప్రభుత్వం

ఈ ఏడాది ఉద్యాన పంటలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. ధరల పతనంతో ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల కారణంగా దిగుబడి అంతంతమాత్రమే ఉన్నా బొప్పాయి, చీనీ కాయలకు ధరలు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కొన్నేళ్లుగా వాణిజ్య పంటలు సాగు చేసి తీవ్ర నష్టాలు చూసిన రైతులు ఈ సారి బోరు బావుల ద్వారా ఉద్యానవన పంటలపై ఆసక్తి చూపారు. ఉద్యాన పంట ఉత్పత్తులు చేతికి వచ్చిన సమయంలో ధరలు లేకపోవడంతో నష్టాలు వస్తున్నాయని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం, తొండూరు, లింగాల, పులివెందుల, వేముల మండలాలలో దాదాపు 27 వేల హెక్టార్లలో చీనీ సాగులో ఉంది. జిల్లాలోనే పులివెందుల నియోజకవర్గంలోని చీనీ కాయలకు రాష్ట్ర స్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి ప్రాంత చీనీ కాయలు అధిక రోజులు నిల్వ ఉండడంతో పాటు, కాయలు నాణ్యత సైతం బాగా ఉండడంతో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి కాయలను ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు చీనీ చెట్లకు తెగులు అధికం కావడంతో వాటిని నివారణ కోసం వేల రూపాయలు వెచ్చించి క్రిమిసంహారక పిచికారి మందులు కొడుతున్నా ఏం మాత్రం ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఇదే సమయంలో టన్ను చిన్ని కాయలు రూ. 50 వేల నుంచి రూ. 60 వేలు ఉండేవి. వ్యాపారులు తోటల వద్దనే కొనుగోలు చేశారు. ఈ ఏడాది టన్ను రూ. 36 వేలు దాటకపోవడంతో తీవ్ర నష్టం వస్తుందని రైతులు చెబుతున్నారు. ధరల స్థిరీకరణ ఏర్పాటు చేశామంటున్న పాలకులు, ప్రభుత్వం ఆ మేరకు ఎక్కడ చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సింహాద్రిపురంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న చీనీ కాయలు

బొప్పాయి ధరలు పతనం ...

నియోజకవర్గంలో వ్యాప్తంగా బొప్పాయి సాగు ఇటీవల కాలంలో ఘననీయంగా పెరిగింది. రెండేళ్ల నుంచి ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు వాటి సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ప్రారంభంలో టన్ను బొప్పాయి కాయలు రూ. 14 వేల నుంచి రూ. 16 వేలకు నడిచింది. అయితే ఇటీవల వ్యాపారులు ధరలను అమాంతంగా తగ్గించడంతో తీవ్రంగా నష్టపోతున్నామని సాగు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల ప్రాంతం నుంచి పంట ఉత్పత్తులను వ్యాపారులు స్థానికంగా కొనుగోలు చేసి తమిళనాడు ,మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ,పంజాబ్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే పై మార్కెట్లో ధరలు తగ్గినట్లు దళారులు చెబుతూ కేవలం తోటల వద్ద తను టన్ను రూ. 6 వేలకు కొనుగోలు చేయడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. టన్ను రూ. 15 వేలు ఉంటేనే కొంతమేర లాభసాటిగా ఉంటుందని, లేకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని బొప్పాయి రైతులు చెబుతున్నారు. ఏడాది అరటి ధరలు సైతం పెరగకపోవడం వల్ల అరటి రైతులు సైతం నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వం నుంచి కరువైన ప్రోత్సాహం..

రెండేళ్ల నుండి ఉద్యానవన పంటలు సాగుచేసిన రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం నిలిపివేయడం పట్ల ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అరటి సాగు చేసే రైతులకు రెండు సంవత్సరాల సాగుకు కలిపి హెక్టారుకు రూ.4 వేలు ప్రోత్సాహం లభించేది. అదేవిధంగా బొప్పాయి సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ. 2 వేల ప్రోత్సాహం ప్రభుత్వం అందజేసేది. గడిచిన రెండేళ్ల నుంచి ప్రభుత్వం ఈ పథకాలను రద్దు చేసింది. ఈ ప్రోత్సాహం రాకపోవడంతో పట్ల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు పెట్టుబడి పెరిగింది

రెండేళ్ల నుండి చీనీ చెట్లకు తెగులు కారణంగా పెట్టుబడి భారీగా పెరిగింది. అయితే ఆశించిన మేరకు దిగుబడులు లేకపోవడంతో పాటు ధరలు కూడా ఆశాజనకంగా లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. తెగులపై అధికారుల దృష్టి తీసుకెళ్లిన ఏమాత్రం ప్రయోజనం లేదు.

- గోపాల్ రెడ్డి, చీనీ రైతు, సింహాద్రిపురం

బొప్పాయి ధరలు అమాంతంగా తగ్గాయి

బొప్పాయి కు ధరలు బాగా ఉండటంతో సాగు చేపటాం. అయితే పంట చేతికొచ్చిన సమయంలో ధరలు అమాంతంగా తగ్గిపోయాయి. కిలో కేవలం ఆరున్నర రూపాయిలకే మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా పెట్టుబడి రాకపోగా నష్ట వస్తోంది.

-చంద్రమోహన్ రెడ్డి, బొప్పాయి రైతు, గురుజాల.

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం..

ప్రస్తుతం మార్కెట్ ధరలు కొంతమేర తగ్గిన విషయం వాస్తవమే. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. గతంలో ప్రభుత్వం అరటి, బొప్పాయి సాగు చేసే రైతులకు ప్రోత్సావ పథకాలను అందజేసేవారం. ఇటీవల కాలంలో ప్రభుత్వ ఈ పథకాలను రద్దు చేసింది.

-వీరారెడ్డి, ఉద్యానవన శాఖ విస్తరణ అధికారి, సింహాద్రిపురం.

గురజాలలో కోతకు సిద్ధంగా ఉన్న బొప్పాయి

కడపలో క్రాస్ ఓటింగ్ గుబులు!

- వైసిపి ఎంపీ ఓట్లకు కాంగ్రెస్ ఎసరు
- ద్వితీయ స్థానానికి టిడిపి, కాంగ్రెస్ పోటాపోటీ
- ఫజిల్‌గా మారిన టిడిపి అభ్యర్థి భవితవ్యం

వైసిపికి క్రాస్ ఓటింగ్ బెడద తప్పలేదు. సార్వత్రిక ఎన్నికల పార్లమెంట్ బరిలో వైసిపి తరపున వైఎస్ అవినాష్‌రెడ్డి, కాంగ్రెస్ తరుపున వైఎస్ షర్మిల, టిడిపి తరుపున భూపేష్‌రెడ్డి ప్రధాన ప్రత్య ర్థుల మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. 2019 సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముంగిట చోటుచేసుకున్న మాజీమంత్రి వైఎస్ వివేకా హత్య ఘటన ఎజెండాగా మారిన నేపథ్యం క్రాస్ ఓటింగ్‌కు దారి తీసింది. దీనికి కాంగ్రెస్ తరుపున వైఎస్ షర్మిల బరిలో నిలవడం, ఆమె వివేకా కుటుంబానికి అండగా నిలవడంతో రాజకీయం ఆసక్తి కరమైన మలుపు తీసుకుంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప పార్లమెంట్‌లో రసవత్తర పోరు నడిచింది. మాజీ ముఖ్య మంత్రి వైఎస్ కుటుంబ సభ్యులు ప్రత్యర్థులుగా బరిలో నిలవడమే కారణం. వైసిపి తరుపున వైఎస్ అవినాష్‌రెడ్డి, కాంగ్రెస్ తరుపున వైఎస్ షర్మిల, టిడిపి తరుపున సి.భూపేష్‌రెడ్డి మధ్య హోరాహోరీ పోరు నడిచింది. వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులిద్దరూ వైఎస్ కుటుంబీకులు కావడం ఉత్కంఠను కలిగిస్తోంది. కడప పార్లమెంటులో 16, 39,066 ఓటర్లున్నారు. ఇందులో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ నియోజకవర్గాలున్నాయి. వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రత్యక్షంగా పులివెందుల, పరోక్షంగా జమ్మలమడుగు అసెంబ్లీతో సంబంధం కలిగి ఉన్న సంగతి తెలిసిందే. టిడిపి అభ్యర్థి సి.భూపేష్‌రెడ్డికి జమ్మలమడుగు సొంత నియోజకవర్గం. వీటితో మాజీమంత్రి వైఎస్ వివేకా నందరెడ్డికి అనుబంధం కలిగి ఉన్న సంగతి తెలిసిందే. 2019 సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముంగిట హత్యకు గురి కావడం పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారింది. 2024 సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన వైసిపి, కాంగ్రెస్, టిడిపి అభ్యర్థులకు జమ్మలమడుగు, పులివెందుల నియోజకవర్గాల్లో ఆధిక్యం కోసం హోరాహోరీగా పోటీ పడుతుండడం గమనార్హం.



వైసిపికి క్రాస్‌ఓటింగ్ గుబులు!

2024 సార్వత్రిక ఎన్నికలకు వైఎస్ వివేకా హత్య సంఘటన వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటంగా మారింది. వైసిపి అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్రంగా ఎన్నికల ప్రచారం నడిచింది. వైఎస్ వివేకా హత్య ఘటనలో సంబంధం ఉందనే పేరుతో సాగించిన ఎన్నికల ప్రచారం సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో పార్లమెంట్ పరిధిలో కడప, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిలకు భారీగా క్రాస్‌ఓటింగ్ పడినట్లు పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి మూడు లక్షల ఓట్ల కుపైగా మెజార్టీతో గెలిచిన సంగతి తెలిసిందే. వైఎస్ వివేకా హత్య ఘటన ఎజెండాగా మారిన సెంటిమెంట్ పరిస్థితుల నేపథ్యంలో ఏడు నియోజకవర్గాల వ్యాప్తంగా క్రాస్‌ఓటింగ్ నడిచినట్లు తెలు స్తోంది. టిడిపి ఓటర్లు సైతం క్రాస్‌ఓటింగ్‌కు మద్దతు పలికినట్లు చర్చ నడుస్తోంది.

ద్వితీయ స్థానానికి కాంగ్రెస్ వర్సెస్ టిడిపి

కడప పార్లమెంట్ ఎన్నికల్లో ద్వితీయ స్థానానికి కాంగ్రెస్, టిడిపి అభ్యర్థులు హోరాహోరీగా పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. వైసిపికి పోలైన ఓట్లలో 40 శాతం వైసిపికి, 30 శాతం కాంగ్రెస్‌కు పోలైనట్లు అంచనా. ఈలెక్కన కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిలకు రెండు నుంచి మూడు లక్షల ఓట్లు పోలైతే వైసిపి గెలుపు అవకాశాలు గల్లంతయ్యే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి తొమ్మిది లక్షలు, టిడిపి నాలుగు లక్షలుపైగా పోలైన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి పోలైన ఓట్లు కాంగ్రెస్‌కు చీలడం, టిడిపి ఓటర్ల నుంచి సైతం కాంగ్రెస్‌కు మద్దతు లభించిన నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిలకు ద్వితీయ స్థానం నిలిచే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. జమ్మలమడుగు టిడిపి అభ్యర్థి సి.భూపేష్‌రెడ్డి సొంత నియోజకవర్గం మినహా మిగిలిన ఆరు అసెంబ్లీ స్థానాల్లో క్రాస్ ఓటింగ్ నడిచే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా మహిళలు పెద్దసంఖ్యలో పోలింగ్‌కు హాజరైన నేపథ్యంలో వైఎస్ జగన్ మాస్ ఫాలోయింగ్ కలిగి ఉండడం, ప్రభుత్వ సంక్షేమ పథ కాలు పంపిణీ చేయడం, కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిల మహిళ కావడం, వివేకా హత్య సెంటిమెంట్ పండించడం, టిడిపికి ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు పోలయ్యాయనే అంచనాలతో ఎవరి ధీమాలో వారు ఉండడం సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది.

నిస్వార్థ ప్రజా నాయకుడు 'పుచ్చలపల్లి'

కడప : సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

బద్వేల్ : నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజశక్తి-కడప అర్బన్

దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ఉద్యమ నిర్మాత సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సిపిఎం ఆవిర్భావ నిర్మాత తొలి పార్లమెంటు ప్రతిపక్ష నాయకులు ఆదర్శ కమ్యూనిస్టు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కడప పాత బస్టాండ్ సిపిఎం జిల్లా కార్యాలయంలో నగర కార్యదర్శి రామ మోహన్ అధ్యక్షతన సభ నిర్వహించారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో దేశంలోని 420 రాచరిక సంస్థానాల రద్దు కోసం, భూమి కోసం, భుక్తి కోసం, మానవ విముక్తి కోసం సుందరయ్య ఉద్యమాలు చేశారని పేర్కొన్నారు. భారతదేశంలో స్వాతంత్ర అనంతరం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం కృషి చేశారని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమ పార్లమెంటరీ మొదటి ప్రతిపక్ష నాయకుడిగా, సిపిఎం ఆవిర్భావ తొలి ప్రధాన కార్యదర్శిగా, దేశంలోని శ్రామిక ప్రజల మధ్య అనైక్యతను, ఘర్షణను తొలగించి, ఐక్యతను పెంచి, కార్మిక రాజ్యం కోసం, సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కోసం, దేశంలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని సుందరయ్య నిర్వహించారని చెప్పారు. రాజకీయాలు ప్రజాసేవకు కేంద్రంగా ఉండాలని, నేటి పాలకులు వ్యాపారంగా మార్చుకుంటున్నారని ఎద్దేవ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి ఊబిలో కూరుకు పోతున్నాయని తెలిపారు. 18వ సార్వత్రిక ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో, బిజెపి, వైసిపి ప్రభుత్వాలు తొలగిపోయి దేశంలో 'ఇండియా వేదిక' రాబోతోందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, లక్ష్మీదేవి, సిపిఎం సీనియర్ నాయకులు పాపిరెడ్డి, నగర కమిటీ సభ్యులు సుబ్బయ్య, రాజేంద్ర, సిపిఎం ప్రజాసంఘాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. **బద్వేలు :** ఆధునిక రాజకీయాలలో విలువలు పాటించేవారు చాలా తక్కువ, సుందరయ్య వంటి వారు రాజకీయాలలో అరుదుగా ఉంటారని సిపిఎంజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గండికోట శివకుమార్ అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా బద్వేల్ పట్టణంలోని సుందరయ్య కాలనీ, చాకలి ఐలమ్మ కాలనీ, జ్యోతి బస్ కాలనీలలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా సుందరయ్య భవనంలో ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ముడియం చిన్ని, కొండయ్య, మోక్షమ్మ నాగార్జున, ఎస్.కె. మస్తాన్ షరీఫ్, అంజి, సురేంద్ర, ఓబుల్ రెడ్డి మస్తాన్‌బీ, ఖైరున్ బి, నాగలక్ష్మి , నాగమ్మ, రత్నమ్మ ఫాతిమా, మూర ప్రసాదు రాయప్ప, రాజగోపాల్, గంప లచ్చుమ్మ పాల్గొన్నారు. **ఒంటిమిట్ట :** మండల కేంద్రంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఎం ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి నరసయ్య మాట్లాడుతూ సుందరయ్య పేదల బడుగు బలహీన వర్గాల భూముల కోసం, రైతాంగ ఉద్యమం పోరాటాలు చేసిన మహనీయుడని పేర్కొన్నారు. సిపిఎం నాయకులు పి సురేష్ బాబు, ఎ హరిబాబు, యస్ సుబ్బయ్య, సాంబయ్య కార్యకర్తలు పాల్గొన్నారు. **బ్రహ్మంగారి మఠం :** ఆధునిక రాజకీయాలలో విలువలు పాటించేవారు చాలా తక్కువ మందిలో సుందరయ్య రాజకీయాలలో అరుదుగా ఉంటారని, భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ మండల సీనియర్ నాయకులు గండి గురయ్యా అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య గారి వర్ధంతి సందర్భంగా వైవిఆర్ కాలనీలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా వైవిఆర్ కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు సునీల్ , అజయ్ ,నరసింహులు పార్టీ సభ్యులు రాజశేఖర్, గురయ్యా ,పవన్ కుమార్, సుబ్బమ్మ, ఓవులమ్మ, వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, గంగాదేవి, నరసమ్మ, గురక్క, అరుణ, కుమారి, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు. **మైదుకూరు:** పుచ్చలపల్లి సుందరయ్య ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వతంత్ర సమరయోధుడు, కమ్యూనిస్టు గాంధీ అని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.శివకుమార్ అన్నారు. మైదుకూరులోని సుందరయ్య నగర్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు గురయ్యా, పోలయ్య, రాజా, వాసు, రాయప్ప, సుధాకర్, లక్ష్మీదేవి పాల్గొన్నారు. **మైలవరం :** పేదల ఆశా జ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య అని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం సుందరయ్య 39వ వర్ధంతిని సిపిఎం మండల కార్యదర్శి కొండయ్య అధ్యక్షతన నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, గోరిగే కృష్ణ, శంకర్, గిరిధర్, దాసు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** దక్షిణ భారత కమ్యూనిష్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య తన యావదాస్తిని పేదలకోసం ఖర్చుచేశారని అటువంటి వారు ఈ రోజు దీపం పెట్టి వెదికినా దొరకరని సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక మమత నర్సింగ్ హోంలో సుందర్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నరసింహారెడ్డి, లాయర్ ఈశ్వర్‌రెడ్డి, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్‌బేగం ,పట్టణ కార్యదర్శి వెంకటసుబ్బయ్య ,అధ్యక్షులు సర్వేశ్వరి, లక్ష్మీదేవి, బాబు, చెన్నారెడ్డి, ఝాన్సీ, మల్లి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

బ్ర. మఠం : నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

ప్రొద్దుటూరు : వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం నాయకులు

ఇళ్ల స్థలాలు సాధించే వరకూ ఉద్యమిస్తాం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి -గోపవరం

బద్వేలు మండలంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొన్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు, పక్కా గృహాలు దక్కేవరకు ఉద్యమాలు సాగిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. స్థానిక సుందరయ్య నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, ప్రభుత్వాలనుసరిస్తున్న విధానాలతో గ్రామీణ ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా గ్రామాల్లో బతుకు భారమై పట్టణాలకు పెద్ద సంఖ్యలో పేదలు వలస వెళ్తున్నారని వాపోయారు. పట్టణాలకు వచ్చిన పేదలకు సంపాదనలో సగభాగం అద్దెలకు సరిపోతుందని, జీవనం దుర్భరంగా మారుతోందని పేర్కొన్నారు. ఈ స్థితిలో పేదలందరిని సమీకరించి వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వ భూమిలో గతంలో సుందరయ్య కాలనీ ఏర్పాటు చేసిందని, ఇటీవల కాలంలో 700 మంది పైగా పేదలతో గుడిసెలు వేయించిందని తెలిపారు. ఈ గుడిసెలు వేసుకున్న వారంతా రెక్కల కష్టం మీద ఆధారపడి జీవించే నిరుపేదలని చెప్పారు. ప్రభుత్వం వెంటనే పేదలందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలు పేదలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటూ వారి ముఖ్యమైన సమస్యలను విస్మరిస్తున్నాయని అన్నారు. మరోవైపు ప్రభుత్వ భూములను కాంట్రాక్టరు, రియల్ ఎస్టేట్‌లు, అధికార పార్టీలకు చెందిన నాయకులు అక్రమంగా ఆక్రమిస్తుంటే పాలకులు గుడ్లప్పగించి చూస్తున్నారని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్ మాట్లాడుతూ పేదలు, అన్ని విధాలా అర్హులు, నిలువ నీడ లేని వారు జానడు జాగా కోసం ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే అనేక ఆటంకాలు కల్పిస్తున్నారని అన్నారు. పేదలకు అండగా ఉన్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులమీద అనేక కేసులు పెట్టి అరెస్టులు, జైళ్ల పాలు చేస్తున్నారని అన్నారు. రాబోయే కాలంలో నిరుపేదలందరిని సమీకరించి వారి హక్కుల రక్షణ కోసం, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాల సాధన కోసం, వారు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక వసతుల రూపకల్పన కోసం అనేక ఉద్యమాలు సాగిస్తామని ఆయన అన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పేదలను మోసం చేసే తీరుపై పాలకులను ప్రశ్నిస్తామని, పేదల తరపున పోరాడుతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్, స్థానిక నాయకులు ఇ.రమణ, జిల్లా నాయకులు డి వెంకటేష్, పుల్లయ్య, చంద్ర, నాగేంద్ర, మహిళా సంఘం నాయకులు దుర్గమ్మ, రామసుబ్బమ్మ పాల్గొన్నారు.

ప్రజల సహకారం మరువలేనిది

ప్రజాశక్తి - కడప అర్బన్

మానవతా సంస్థకు ప్రజలు అందిస్తున్న సహకారం మరువలేనిదని వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో మానవతా సంస్థ సమావేశం పి. సుబ్బరాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మానవతా సంస్థ విలువలతో కూడిన సంస్థ అన్నారు. ఆత్మీయ సహకార కమిటీ ద్వారా కష్టాలలో ఉన్న వ్యక్తికి ఉపశమనం కలిగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలందరి సహకారం వల్ల మానవతా సంస్థ దినదినాభివృద్ధి చెందుతుందని తెలిపారు. క్రిమిటోరియమ్‌కు తమ వంతు సహకారంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి లక్ష రూపాయలు, శ్రీ లక్ష్మీనరసింహ మెడికల్స్ అధినేత పివిఎల్ నరసింహ బాబు లక్ష రూపాయలు చెక్కులను మానవతా సంస్థ ప్రతినిధులకు అందజేశారు. రాజేశ్వరమ్మ మానవతా సంస్థ చేపట్టిన మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి తన వంతు సహాయంగా రూ.12 వేల రూపాయలు ప్రకటించారు. వీరికి మానవతా సంస్థ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్, డాక్టర్ అవటాల రామాంజుల రెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం, రక్తదాన కమిటీ చైర్మన్ డాక్టర్ కమలాకర్ రెడ్డి, బైరెడ్డి రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్ మద్దిక సుబ్బిరెడ్డి, ప్రతాప్ రెడ్డి అనేకమంది మానవతా ప్రముఖులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఉపాధ్యాయులపై వేధింపులు తగవు

కడప అర్బన్ : ప్రభుత్వం వేసవి సెలవులు జూన్ 12 వరకు ప్రకటించినా జిల్లాలో చైతన్య, నారాయణ విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రయివేట్ ఉపాధ్యాయులకు వేసవి సెలవులు ముగియక ముందే వర్క్ షాప్ పేరుతో వారం రోజులుగా కడప నగర శివార్లలో క్లాసులు పెట్టడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. వీటిపై విద్యా శాఖా అధికారులు చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రయివేట్ ఉపాధ్యాయులను రకరకాల క్లాసులు, వర్క్ షాప్‌ల పేరుతో వేధించడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చైతన్య, నారాయణ విద్యా సంస్థలు నడుచుకుంటున్న విద్యా శాఖా అధికారులు పట్టించుకోకపోవడం దేనికి నిదర్శనమని తెలిపారు. ఆర్‌జెడి ప్రయివేటు ఉపాధ్యాయులను క్యాన్వాస్, వర్క్ శాప్‌ల పేరుతో వేధిస్తే చర్యలు తీసుకుంటామని సర్క్యులర్ జారి చేసినా బేఖాతర్ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్నా చైతన్య, నారాయణ విద్యా సంస్థలపై విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నీలం సంజీవరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

నీలం సంజీవరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె

నీతి, నిజాయితీకి నిలువుటద్దం నీలం సంజీవరెడి అపి పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలోని కాంగ్రెస్ కార్యాలయంలో స్వర్గీయ నీలం సంజీవరెడ్డి 111వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్వతంత్ర సమరయోధుడు, రైతుబిడ్డ, భారత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని నాలుగేళ్ల జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. రెండు సార్లు ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా, రాష్ట్రపతిగా ఉన్నత పదవులు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయన్నారు. ఎఐసిసిగా, కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేసినట్లు చెప్పారు. నీలం సంజీవరెడ్డి పదవులకే వన్నె తెచ్చినట్లు ఆయన వివరించారు. బస్సు రూట్ల జాతీయకరణ విషయంలో సుప్రీంకోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలు చేసినందుకు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి నైతిక విలువలు నెలకొల్పిన మహానేత సంజీవరెడ్డి అన్నారు. కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కూడా తులసిరెడ్డి ఘన నివాళులర్పించారు. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడిగా ఉంటూ సైకిల్‌పై పార్లమెంటుకు నిరాడంబరంగా వెళ్లిన వ్యక్తి సుందరయ్య అన్నారు. సుందరయ్య నిరాడంబరత నేటి రాజకీయ నాయకులకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, సుబ్రమణ్యం, రామకృష్ణ, వినయ్, శివ, బాలం సుబ్బరాయుడు, రాజా, వేమయ్య పాల్గొన్నారు.

ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదు

ప్రజాశక్తి - మైదుకూరు

డిఎస్‌పి వెంకటేశులు

జూన్ 6వ తేది వరకు మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మైదుకూరు డిఎస్పీ వెంకటేశులు హెచ్చరించారు. ఆమేరకు డిఎస్పీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 6 అనంతరం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ముగిసిన తర్వాత పరిశీలించి ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతిస్తామన్నారు. అలాగే 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. నలుగురికి మించి గుమికూడవద్దన్నారు. 30 పోలీస్ యాక్ట్ కూడా అమలులో ఉందన్నారు. మైదుకూరు, బద్వేల్ పట్టణాల్లో అన్ని రకాల దుకాణాలు రాత్రి 9.00 గంటలకు మూసివేయాలని డిఎస్‌పి తెలిపారు. ట్రబుల్ మాంగర్లు జాగ్రతగా ఉండాలన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రోడ్డుపై నిలిచిన నీటిని చూపిస్తున్న రమణ

ఆక్రమణలకు అడ్డాగా మైదుకూరు మున్సిపాలిటీ

- రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షులు రమణ

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీగా ఏర్పడి 13ఏళ్లు అవుతున్నా కనీస వసతుల కల్పనలో ఎలాంటి అభివృద్ధి చెందలేదని రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ అన్నారు. మైదుకూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీగా మారిన తర్వాత పాలకులు, అధికారుల సహకారంతో వంకలు, వాగులు, ప్రధాన రోడ్ల ఆక్రమణకు గురయ్యాయని ఆరోపించారు. ఏ రాజకీయ పార్టీ కూడా ఈ సమస్యపై స్పందించలేదన్నారు. ప్రధానంగా పట్టణంలోని ప్రధాన రోడ్డు నాలుగు రోడ్ల కూడలి నుంచి కడప రోడ్డులోని పాత సాయిబాబా గుడి, స్వరాయిపల్లె రోడ్డు మోటు వరకు రోడుకు ఇరువైపులా డ్రయినేజీ కాలవ నుండి 10 నుంచి 20 అడుగుల వరకు ఎవరి అంగడి ముందు వారు ఆక్రమించారన్నారు. కాలినడక ప్రయాణికులకు ప్రమాదంగా ఉందన్నారు. రోజు ఉదయం పూట ఆరు గంటల నుంచి 8 గంటల లోపల మున్సిపల్ పారిశుధ్య కార్మికులు రోడ్డు మీద ఉన్న మట్టి రోడ్డు సైడ్‌కు క్లీన్ చేస్తే వ్యాపారులు వారు అంగళ్లు తెరవగానే వారి అంగళ్లలోని కసువును డ్రైనేజీ వరకు ఉన్న మట్టిని రోడ్డు మీదకు తోసి ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సమస్యల పైన గత మూడు సంవత్సరాలుగా రైతు సేవాసమితి వివిధ రూపాలలో నిరసనలు తెలియజేస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. తారు రోడ్డు నుండి డ్రయినేజీ రోడ్డు వరకు ఉన్న మట్టి తొలగింపునకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ పాలకులు, అధికారులను రమణ కోరారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్, శిల్పారామంలో చిన్నారులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం డాక్టర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి కళా తరంగిణి సంస్థ రాజేష్ బాబు కళాబృందం వారిచే క్లాసికల్, జానపద, వెస్టర్న్ నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శిల్పారామంలో నాగార్జున ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు రాజేష్, పరిపాలన అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **TAKKOLA JAYAMMA** w/o **TAKKOLU VENKATASESHA REDDY,** r/o D.No.1/43, Narvakatipalli (V)&(P), Vontimitta (Mandal), YSR Kadapa (district), A.P. I have been changed my Name **TAKKOLA JAYAMMA** (Old name) to **TAKKOLU JAYAMMA** (New name)

చిన్నపాటి వర్షం.. రోడ్లన్నీ జలమయం..

పాలకులు, అధికారుల నిర్లక్ష్యమే కారణం, వర్షాకాలంలో సమస్యల్లేకుండా చూడాలని ప్రజల వినతి

కడప రోడ్డులో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక నగర పంచాయతీ పరిధిలో శనివారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని జాతీయ రహదారిపై ముద్దనూరు రోడ్డులో కాలువలు నిర్మాణం పూర్తి చేశారు. కడప రోడ్డులోని కాలువలు కేవలం టెండర్లకే పరిమితమయ్యాయి. కడప రోడ్డులో కాలువలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే నీరు ఎటూపోలేక రోడ్లపై నిలివడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై నీరు నిలవడంతో జాతీయ రహదారి దెబ్బతింటోందని, దుకాణాల ముందు నీరు నిలవడంతో వ్యాపారాలు దెబ్బతింటున్నాయని స్థానికులు వాపోతున్నారు. మహేశ్వర్ నగర్‌లోని ప్రధాన వీధుల వద్ద నీరు నిలవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముద్దనూరు రోడ్డులో కాలువలు ఉన్నప్పటికీ వర్షపు నీరు కాలువల గుండా ప్రవహించకుండా రోడ్లపైనే ప్రవహిస్తున్నాయి. రోడ్డుమీద నీరు కాలువల్లోకి పోవుటకు ఉన్న రంధ్రాలు పైన ఉండడంతో నీరు పోలేక రోడ్లపైనే నిలుస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇదంతా అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమని ప్రజలు ఆరోపిస్తున్నారు. రానున్నది వర్షాకాలం కావడంతో ముందస్తు చర్యలు చేపట్టి రోడ్లపై నీరు నిలవకుండా చూడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ఐసిఎల్ కర్మాగారం వద్ద కాలువల్లోకి నీరు పోలేక రోడ్డుపైనే నిలిచిన నీరు

విద్యతోపాటు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం

భవిష్యత్తులో మరింత విస్తృత సేవా కార్యక్రమాలు : శ్రీధర్‌రెడ్డి

బహుమతులు అందజేస్తున్న వైవిఆర్ ట్రస్ట్ చైర్మన్, ఎంఇఒ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు విద్యతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని వైజిఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైసిపి స్టేట్ ఐటి వింగ్ జనరల్ సెక్రెటరీ ఎర్రనాగు శ్రీధర్‌రెడ్డి (నంద్యాలంపల్లె గ్రామవాసి) పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన సింహాద్రిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరింత సదుపాయాలు కల్పిస్తామన్నారు. పదవ తరగతి తర్వాత విద్యార్థులకు సైతం ఆర్థిక సహాయ సహకారాలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. ప్రస్తుతానికి మండలంలోని 8 ప్రభుత్వ పాఠశాలల 24 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమాన్ని ఇతర మండలాలకు, నియోజకవర్గాలకు విస్తరించి ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు. మండల విద్యాధికారి-2 శారద మాట్లాడుతూ సింహాద్రిపురం మండలం ఈ ఏడాది పది ఫలితాల్లో జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలవడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలు ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అర్హత కలిగిన ఉపాధ్యాయులచే విద్యార్థులకు అర్థం అయ్యేవిధంగా విద్యా బోధన చేస్తున్నారన్నారు. వైజిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహక బమతులు అందించడం ఎంతో శుభపరిణామమని చైర్మన్‌ను ఎంఇఒ కొనియాడారు. అనంతరం నగదు బహుమతులు, షీల్డ్‌ను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎర్రనాగు గురివిరెడ్డి, రిటైర్డ్ బిఎస్ఎన్ఎల్ అధికారి ఆనందరెడ్డి, నిడివెలగల కస్తూర్బా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గురుదేవి, సింహాద్రిపురం, అంకాలమ్మ గూడూరు, కోరగుంటపల్లె, హిమకుంట్ల, రావులకొలను, గురుజాల, బలపనూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఇతర పాఠశాలలో ఉపాధ్యాయులు, వైజిఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పంటపొలాల రోడ్డు బాగుపడేదెన్నడో..!

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని జడ్డిగారి కొట్టాలు వద్ద నుండి పంట పొలాలకు వెళ్లే రహదారి చాలా అధ్వానంగా ఉంది. సిద్ధారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ఉన్న ఈ రోడ్డు ద్వారా సుమారుగా 350 ఎకరాల వరకు సాగు భూములున్నాయి. ఈ రహదారి పూర్తిగా గుంతలమయం కావడంతో రైతులకు ఇబ్బందికరంగా మారింది. జొన్న, వేరుశనగ, వరి, మినుము వంటి పంటలు సాగు చేస్తున్నారు. ట్రాక్టర్, ఎడ్ల బండి ఈ మార్గాన వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సివస్తోంది. ఎరువులు తీసుకెళ్లాలన్నా, పంట దిగుబడి తరలించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న పొలాల దారి

దండకారణ్య మారణహోమాన్ని ఖండించండి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దండకారణ్యంలో జరుగుతున్న మారణహోమాన్ని ప్రజాస్వామిక వాదులు, పార్టీలు ఖండించాలని, ఆదివాసి సమాజాన్ని కాపాడాలని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి కోరారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో దండకారణ్యంలో జరుగుతున్న కగార్ ఆపరేషన్లు నిలిపి వేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశంలోని అడవుల్లో నిక్షిప్తమైన ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా కట్టబెట్టడానికి హిందూ ఫాసిస్టు పెట్టుబడిదారుల అనుకూల ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అందులో భాగంగానే అడవుల్లో ఉన్న ఆదివాసులను తరిమి వేయడానికి చేపట్టిన ఆపరేషన్ కగారని పేర్కొన్నారు. ఈ సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లలో దాదాపు 115 మంది గిరిజనులను చంపడం జరిగిందన్నారు. చివరకు పసిపిల్లలను, వృద్ధులను కూడా చంపి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనా మీద ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాగతానికి ఏమాత్రం తీసిపోని విధంగా దండకారణ్యంలో భారత సైనిక బలగాలు దుర్మార్గంగా విరుచుకుపడుతున్నాయన్నారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు, పికేఎస్ నాయకుడు శ్రీను, కాంగ్రెస్ ఇన్‌ఛార్జి నజీర్, సీపీఐ నాయకుడు సుబ్బరాయుడు, బిఎస్‌పి జయరాం, ఆర్‌విఎస్ సరిత, సిఎంఎస్ పద్మ, న్యాయవాది దాదా, జహంగీర్, మాల మహానాడు మురళి, కవి రచయిత మహమ్మద్ పాల్గొన్నారు.

పౌర సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పౌర సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని, పౌర సమాజం సామాజికంగా ఆలోచించేలా జన విజ్ఞాన వేదిక (జెవివి) పలు రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని, విద్యార్థులు ఇలాంటి అవకాశాలను వినియోగించుకోవాలని జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ అన్నారు. జెవివి, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జెవివి కార్యాలయంలో లాసెట్ అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతను కలిగి ఉండాలన్నారు. కరెంట్ ఎఫైర్స్ సబ్జెక్టును సివిల్ సర్వీస్ ఫ్యాకల్టీ రవిశంకర్, రీజనింగ్ సబ్జెక్టును పివిఆర్ ఇన్సిట్యూట్ చైర్మన్ రమణ, స్టడీ ఆఫ్ లా సబ్జెక్టును ఏఐఎల్‌యు న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వీనర్ కిరణ్, హరిత బోధించారు. లాసెట్ పరీక్షలో మంచి మార్కులు సాధించాలని, మెరుగైన తయారీకి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో జెవివి పూర్వ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్షులు పోలంకి శ్రీరాములు, జెవివి ప్యాట్రన్స్ మురళీగుప్త, ప్రధాన కార్యదర్శి సునీత, ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ కె.విజయనాగేంద్ర, కో-ఆర్డినేటర్లు అక్షయ, హాసిని, తేజ, భరత్ పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఔత్సాహికులు

చెత్త, వ్యర్థాలతో నిండిపోయిన దారి

కంపుకొడుతున్నా.. పట్టించుకోరా..

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో చెత్త పేరుకుపోయి కంపు కొడుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో వాటర్ ప్లాంట్‌కు వెళ్లే దారిలో దారి మొత్తం విస్తర్లు, చెత్తచెదారం, ఇళ్లల్లోని కసువు తెచ్చి అక్కడ పడేస్తున్నారు. వర్షం వచ్చినప్పుడు ఆ చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక మరపురానిది

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక సరస్వతి విద్యా మందిరం 1999-2000 విద్యా సంవత్సరం విద్యార్థులు ఆదివారం కలిశారు. ఈ కలయిక మరపురానిదని పేర్కొన్నారు. పాఠశాలలో ఒకే తరగతిలో చదివి, అనంతరం ఆ క్లాస్ విద్యార్థులు ఉన్నత చదువులతో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు, కొంతమంది పలు దేశాల్లో ఉన్నత కొలువులు అధిష్టించారు. తామంతా ఒకే పాఠశాలలో చదివి ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేస్తూ దేశ విదేశాలలో కొంతమంది, వివిధ రాష్ట్రాల్లో మరికొంతమంది ఉద్యోగాలు చేస్తున్నారు. ఎక్కడ పని చేసినా మనమంతా ఒక్కటేనని పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఒకరికొకరు కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో పాఠశాలలో జరిగిన అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా వేదికపైకి వచ్చి తమ గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు పాఠశాల అభివృద్ధి కోసం తమ శక్తి మేర ఆర్థికసాయం అందించారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, ఇందుకు పోలీసులతోపాటు అందరికీ ధన్యవాదాలని మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారుమునిరెడ్డి తెలిపారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉందని, ఆరోజుతోపాటు రాబోవు రోజుల్లో కూడా తమ వైపు నుండి ఎలాంటి అవాంఛనీయ సంఘటలకు తావివ్వబోమని ఆయన పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం బంగారుమునిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యర్థి వర్గీయులు ఎలాంటి కవ్వింపు చర్యలకు దిగినప్పటికీ తాము సంయమనం పాటిస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్ పిట్టా బాలాజీ, నాయకుడు నూరి పాల్గొన్నారు.

నైవేద్యాన్ని భక్తులకు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ముగిసిన బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

శ్రీశ్రీశ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఆదివారం మహా నైవేద్యంతో ముగిశాయి. ఆరు రోజులపాటు మఠం పిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి. మఠాధిపతి పెద్ద భార్య కుమారులు వెంకటాద్రి స్వామి భద్రయ్య, వీరంభట్లయ్య, దత్తాత్రేయ, రెండవ భార్య కుమారులు, మహా నైవేద్యాన్ని స్వామి వారి వద్ద ఉంచి పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు. స్వామివారి ప్రసాదాలు స్వీకరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో ఎమ్మెల్యే బిజేంద్రరెడ్డి

బ్రహ్మంగారిని దర్శించుకున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

శ్రీజగద్గురు పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్ర రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. మఠం యాజమాన్యం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి వారి ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి, పాల రామిరెడ్డి, జోగయ్య, దుగ్గిరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు గొల్లపల్లెలో గజపూజ

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని గొల్లపల్లె గ్రామంలో ఈనెల 20న సాయంత్రం మహిళలచే కోలాటం గజపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు, గురువులు రామచంద్రుడు, నాగార్జున తెలిపారు. జైశ్రీరామ్ కోలాట గురువులు నేర్పిన మహిళల కోలాటం గొల్లపల్లె గ్రామంలో 3 నెలల నుంచి మహిళలకు కోలాటం నేర్పించారు. ఈ సందర్భంగా కోలాటం గురువులు రామచంద్రయ్య, నాగార్జున మాట్లాడుతూ కోలాటం ప్రాముఖ్యతను వివరించారు. మండలంలోని కోలాటం అభిమానులు, చుట్టుపక్కల గ్రామ ప్రజలు హాజరు కావాలని గొల్లపల్లె గ్రామ కమిటీ సభ్యులు కోరారు.

ఎయిడ్స్ సంస్మరణ దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఎయిడ్స్ వ్యాధి వల్ల మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని అంతర్జాతీయ కొవ్వొత్తుల సంస్మరణ దినం సందర్భంగా ఆదివారం డాక్టర్ వైయస్ఆర్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో ఎయిడ్స్ నియంత్రణ విభాగం వారి ఆధ్వర్యంలో సిబ్బంది శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి నుండి ప్రారంభమైన ఈ శాంతి ర్యాలీ డాక్టర్ విజయ్, సబ్ యూనిట్ అధికారులు సతీష్ కుమార్, సుబ్రహ్మణ్యం ఐసిటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు కొవ్వొత్తులు వెలిగించి శాంతి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ విజయ్ మాట్లాడుతూ ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష వీడి ప్రేమతో మెలగాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, రక్తనిధి, ఐసిటీసీ ల్యాబ్ టెక్నీషియన్‌లు మహమ్మద్ రఫీ, నాగేష్, ఆసుపత్రి స్టాఫ్‌నర్స్‌లు, సిబ్బంది, సేవాసమితి సభ్యులు రాజా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీలో వైద్య సిబ్బంది